ప్రజాశక్తి
గురువారం 2 మార్చి 2023
5
శ్రీకాకుళం





సమావేశంలో మాట్లాడుతున్న రామసూర్యనారాయణ

ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు చట్టబద్ధత

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్ సూర్యనారాయణ డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి


ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.రామ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం నిర్వహించిన సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం, అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల జీతభత్యాలు, జిపిఎఫ్, అలవెన్స్‌లు తదితర రూపాల్లో జమ చేసుకుంటున్న సొమ్మును తిరిగి ఉద్యోగుల అవసరాలకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఆర్థిక ప్రయోజనాలు ప్రభుత్వ అనుగ్రహంతో వచ్చినవి కావని ఉద్యోగుల హక్కు అని స్పష్టం చేశారు. నిర్దిష్ట కాలపరిమితిలో ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో చెల్లించకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సర్వీసు నిబంధల అంశంపై గవర్నర్‌ను కలిస్తే తమపై ప్రభుత్వం కక్ష కట్టిందన్నారు. గవర్నర్‌కు మెమోరాండం సమర్పిస్తే ఫిర్యాదు చేశానని చెప్తున్నారని, రెండింటికీ తేడా తెలియని బఫూన్లు రాష్ట్రంలో ఉన్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులుగా ఆర్థిక ప్రయోజనాలు-ఉద్యోగుల హక్కు అంశంపై చర్చా వేదికలు నిర్వహించామని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న నాలుగు లక్షల మంది ఉద్యోగుల్లో 1,37,763 మంది ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలన్న డిమాండ్‌కు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారని చెప్పారు. రాజ్యాంగంలోని 266, 283 అధికరణల ప్రకారం ఉద్యోగుల జిపిఎఫ్ సొమ్ము రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలోకి వెళ్లడానికి వీల్లేదని, పబ్లిక్ ఖాతాను నిర్వహించాల్సి ఉందన్నారు. 2021, మార్చి 31వ తేదీ నాటికి జిపిఎఫ్ ఖాతా నంబరు 8009 ఖాతాలో సొమ్ము జమ కావాల్సి ఉందని చెప్పారు. ఆరోజు నాటికి రూ.11 వేల కోట్ల జిపిఎఫ్ సొమ్ము ఉన్నట్లు వెబ్‌సైట్‌లో చూపుతోందని, మరి ఆ సొమ్మును ఉద్యోగులు తమ అవసరాల కోసం వాడుకునేందుకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఆ సొమ్ము పేపర్‌పైనే చూపిస్తున్నారా లేక ఖాతాలో నిజంగానే ఉందా అన్న ఆందోళన ఉద్యోగుల్లో నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో ఆ వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పది శాతం వాటా చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సచివాలయ ఉద్యోగులకు రెండేళ్లుగా సగం జీతమే ఇస్తున్నారని, వారికి రెగ్యులరైజ్ చేసి సర్వీసు నిబంధనలు రూపొందించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హక్కులపై ఏప్రిల్ నుంచి ఉద్యమాలను తీవ్రతరం చేయనున్నామని వెల్లడించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి అలికాన రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గొంటి తిరుపతిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు యుగంధర్, జిల్లా అధ్యక్షులు ఇప్పిలి నారాయణరావు, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.నారాయణరావు, జిల్లాపరిషత్ యూనియన్ అధ్యక్షులు పి.జయమ్మ పాల్గొన్నారు.

సామాన్యుని నెత్తిన 'బండ'

- వంట గ్యాస్‌పై రూ.50 పెంపు
- వాణిజ్య సిలిండర్‌పై రూ.350 బాదుడు
- జిల్లాపై ఏడాదికి రూ.25.79 కోట్ల భారం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపడమే పనిగా పెట్టుకుంది. వంట గ్యాస్ పెంపునకు కొద్ది నెలలు విరామం ఇచ్చిన బిజెపి ప్రభుత్వం మళ్లీ పెంపు మొదలు పెట్టింది. గతేడాది చివరిసారిగా సెప్టెంబరులో రూ.50 పెంచింది. ఆరు నెలల కాలంలో పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగడంతో ధరల జోలికి వెళ్లలేదు. ఎన్నికలు ముగియడంతో జనంపై బాదుడు మొదలు పెట్టింది. వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడంతో రూ.1079.50 నుంచి 1129.50కు చేరింది. వాణిజ్య సిలిండర్ ధరను అమాంతంగా రూ.350 పెంచింది. దీంతో రూ.1853 నుంచి రూ.2,206కు చేరింది. కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలతో జిల్లా ప్రజలపై ఏడాదికి సుమారు రూ.25.79 కోట్ల భారం పడనుంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



జిల్లాల పునర్ వ్యవస్థీకరణ తర్వాత జిల్లాలో మొత్తం 36 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్ పరిధిలో 19, టెక్కలిలో ఎనిమిది ఉండగా, పలాసలో తొమ్మిది ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో 5,73,071 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో సింగిల్ సిలిండర్ ఉన్న సాధారణ గ్యాస్ కనెక్షన్లు 1,81,305, డబుల్ సిలిండర్ ఉన్న కుటుంబాలు 1,20,678 ఉన్నాయి. దీపం కనెక్షన్లలో సింగిల్ సిలిండర్ ఉన్న కుటుంబాలు 1,86,737 ఉండగా డబుల్ సిలిండర్ ఉన్న కుటుంబాలు 17,176 ఉన్నాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఇచ్చిన కనెక్షన్లు 14,929 ఉన్నాయి. వీటితో పాటు ఉజ్వల పథకం కింద 56,754 కనెక్షన్లు ఉన్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 21వ తేదీ వరకు వంటగ్యాస్ ధరల జోలికి పోలేదు. ఎన్నికలు ముగిసిపోవడంతో మార్చి 22న సిలిండర్‌పై రూ.50 పెంచింది. ఇక అక్కడ్నుంచి ఆ ఏడాది సెప్టెంబరు వరకు ధరలను పెంచుతూనే ఉంది.

జిల్లాపై రూ.25.79 కోట్ల భారం

జిల్లాలోని గ్యాస్ వినియోగదారులు సగటున 40 రోజులకు ఒకసారి గ్యాస్ సిలిండర్‌ను బుకింగ్ చేస్తారు. ఏడాది (365 రోజులకు)కి సరాసరిన తొమ్మిది సిలిండర్లను వినియోగిస్తారు. గ్యాస్ ధర 50 పెంచడంతో ఒక్కో వినియోగదారుడిపై రూ.450 భారం పడింది. ఈలెక్కన జిల్లాలో ఉన్న 5,73,071 మంది వంటగ్యాస్ వినియోగదారులపై ఏడాదికి రూ.25.79 కోట్ల భారం పడనుంది.

వంట గ్యాస్ సబ్సిడీ ఎత్తివేత

వంట గ్యాస్‌పై కాస్తాకూస్తో అందిస్తున్న సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరిలో ఎత్తేసింది. ప్రస్తుతం ఉజ్వల పథకం లబ్ధిదారులకు మాత్రమే రూ.200 సబ్సిడీ అందిస్తోంది. గతంలో సిలిండర్‌పై రూ.300 వరకు సబ్సిడీని అందించిన కేంద్ర ప్రభుత్వం క్రమేణా కుదిస్తూ ప్రస్తుతం వినియోగదారుల ఖాతాలో రూ.10.67 మాత్రమే జమ చేస్తోంది.

ధరలతో పేదలు ఉక్కిరిబిక్కిరి

ఇప్పటికే అన్నిరకాల నిత్యవసరాల ధరల పెరిగి ఏమీ కొనలేని పరిస్థితుల్లో ఉన్న పేద, మధ్యతరగతి ప్రజలపై వంట గ్యాస్ ధర పెంపు మూలుగుతున్న నక్కపై తాటిపండు పడిన చందంగా మారింది. కాస్తా కూస్తో వచ్చిన ఆదాయంతో నెట్టుకొస్తున్న సామాన్య జనంపై కేంద్ర ప్రభుత్వం తరుచూ పెంచుతున్న వంటగ్యాస్ ధరలతో వారి ఆర్థిక పరిస్థితిని మరింత దిగజారేలా చేస్తున్నాయి.

వాణిజ్య సిలిండర్లపైనా వాత

వాణిజ్య అవసరాలకు వినియోగించే సిలిండర్ల ధరలనూ కేంద్ర ప్రభుత్వం పెంచింది. ప్రస్తుతం సిలిండర్ ధర 2,206కు చేరింది. వాణిజ్య సిలిండర్ల ధరల పెంపుతో హోటళ్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులపై భారం పడనుంది. దీంతో భోజనం, అల్పాహారం ధరలపై ప్రభావం చూపుతోంది. రోజువారీ కూలీలకు వచ్చే కూలిలో సగం డబ్బులు భోజనం, అల్పాహారానికే సరిపోతున్నాయి. మరోపక్క వాణిజ్య అవసరాలకు వాడే సిలిండర్ ధరలను ఎప్పటికప్పుడు పెంచేస్తుండడంతో చిన్నపాటి భోజన, టిఫిన్ సెంటర్లు నడపలేక ఇబ్బందులు పడుతున్నారు.

పెరిగిన ధరలతో ఇబ్బందులు



నిత్యావసర వస్తువుల ధరలు ఎప్పటికప్పుడు పెరిగిపోతున్నాయి. టైలరింగ్ చేస్తూ బతుకుతున్నాం. ఇళ్ల అద్దెలు, కరెంట్ బిల్లులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం. ఆదాయం మాత్రం పెరగడం లేదు. ఇప్పుడు గ్యాస్ ధర పెంచడంతో అదనంగా మరింత ఖర్చు చేయాల్సి ఉంటుంది.

- అరవ చంద్రకళ, పలాస

టిఫిన్ సెంటర్ నడపడం కష్టంగా ఉంది



వాణిజ్య గ్యాస్ ధరను ఒక్కసారిగా రూ.350 పెంచడంతో చిన్న చిన్న టిఫిన్ సెంటర్లు, భోజన హోటళ్లు నడుపుకుని జీవనం సాగించే మావంటి వాళ్లకు ఇబ్బంది. గ్యాస్ ధరలు పెరిగాయని టిఫిన్ ధరలు పెంచితే ఉన్న వ్యాపారం కూడా సాగదు. పప్పులు, నూనెల ధరలు ఎప్పటికప్పుడు పెరిగిపోతుండడంతో టిఫిన్ సెంటర్లను నిర్వహించలేకపోతున్నాం.

- కోట్ని రూప, టిఫిన్ సెంటర్ నిర్వాహకురాలు

క్షేత్రస్థాయిలో 'ఉపాధి' పరిశీలన తప్పనిసరి

శ్రీకాకుళం : ఉపాధి హామీ మండల స్థాయి ఉద్యోగులు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పనులను తప్పనిసరిగా పరిశీలించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు ఆదేశించారు. మెటీరియల్ పనుల బిల్లుల చెల్లింపులు అంశంపై ఎపిడిలు, ఎంపిడిఒలు, ఎపిఒలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర సిబ్బందితో డ్వామా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన మెటీరియల్ బిల్లులు ప్రాధాన్యతా క్రమంలో రూ.15.26 కోట్లు చెల్లింపులు చేయనున్నట్లు తెలిపారు. అన్ని పంచాయతీల్లోనూ పనులు ప్రారంభించడం, కూలీల సంఖ్యను పెంచడం, సగటు కూలి రూ.250 వచ్చేలా చేయడం అన్న అంశాలపై ఐదు నెలలుగా సిబ్బందికి పదేపదే చెప్తున్నా, ఆశించిన మేర ఫలితాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పనుల అమల్లో దిగువ స్థానంలో ఉన్న మండలాలు, పంచాయతీలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. సమావేశంలో ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, ఎపిడిలు పి.రాధ, అమ్మినాయుడు, శైలజ, కె.లోకేష్, మురళీకృష్ణ, అన్ని మండలాల ఎంపిడిఒలు, ఎపిఒలు, ఇతర ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడే పిడిఎఫ్ అభ్యర్థి

రమాప్రభను గెలిపించండి

ఉభయ గోదావరి జిల్లా ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు



ఓటు అభ్యర్థిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ, ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - అనకాపల్లి

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న, వాటి పరిష్కారానికి పోరాడుతున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం, రింగ్ రోడ్, బెల్లం మార్కెట్ తదితర ప్రాంతాల్లో వాకర్స్‌ను కలిసి కోరెడ్ల రమాప్రభకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్సీతో పాటు పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ, ప్రజా సంఘాల నాయకులు సంయుక్త స్కూల్ కరస్పాండెంట్ గోవిందరావును కలిశారు. పలు విద్యా సంస్థల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలు వంత పాడుతున్నాయని తెలిపారు. విశాఖ రైల్వే జోన్ కోసం, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక, ప్రజా సంఘాలతో కలిసి పిడిఎఫ్ ఎమ్మెల్సీలే పోరాడుతున్నారని చెప్పారు. 250 ప్రజా సంఘాల బలపరుస్తున్న కోరెడ్ల రమాప్రభ ఉత్తరాంధ్ర ప్రజలు గొంతై ఇక్కడి సమస్యలపై గళమెత్తుతారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బి.ఉమామహేశ్వరరావు, గంట శ్రీరామ్, ఎ.బాలకృష్ణ, గంట సురేష్, ఎస్ రమణ, గొర్లి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా ఎమ్మెల్సీ పోలింగ్

- పొరపాట్లకు తావివ్వరాదు
- ఫిర్యాదు వస్తే చర్యలు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పట్టభద్ర, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయి శిక్షణ పొందాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులను ఆదేశించారు. పట్టభద్ర, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌పై జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో మొదటి విడత శిక్షణా తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి చిన్న పొరపాట్లకు తావివ్వకుండా పూర్తిస్థాయి శిక్షణ పొంది సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల సిబ్బంది ఎన్నికల నిర్వహణ పుస్తకాలను క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకోవాలని చెప్పారు. కోడ్ ఆఫ్ కండక్ట్ పాటించాలని, ఎన్నికల విధులను అతిక్రమించవద్దని సూచించారు. విధుల నిర్వహణలో అనుమానాలు ఉంటే శిక్షణా తరగతుల్లో నివృత్తి చేసుకోవాలన్నారు.

జిల్లాలో పట్టభద్రుల ఎన్నికకు 59 పోలింగ్ కేంద్రాలు, స్థానిక సంస్థల ఎన్నికకు 4 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ ప్రక్రియను సీరియస్‌గా తీసుకుని బ్యాలెట్ బాక్సు, బ్యాలెట్ పేపర్, ఇతర పోలింగ్ మెటీరియల్‌తో పాటు పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శక సూత్రాలను అవగాహన చేసుకోవాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల అధికారులపై ఎలాంటి ఫిర్యాదు వచ్చినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల విధి విధానాలు, నిర్వహణ తదితర అంశాలను గార తహశీల్దార్ ఎస్.సుధాసాగర్ సిబ్బందికి స్లయిడ్ షో ద్వారా వివరించారు. శిక్షణా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, కొవ్వాడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళీకృష్ణ, పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేలో జాప్యం ఎందుకు?

సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి



ప్రజాశక్తి - కోటబొమ్మాళి

గ్రామాల్లో చేపడుతున్న సమగ్ర భూ సర్వేలో జాప్యం ఎందుకు అవుతోందని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి విఆర్ఒలు, సర్వేయర్లను ప్రశ్నించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన విఆర్ఒలు, సర్వేయర్లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయంలో భూ సర్వే ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. గ్రామాల్లో కొంతమంది భూ యజమానులు వలసలు వెళ్లడం వల్ల జాప్యమవుతోందని సర్వేయర్లు బదులిచ్చారు. వారికి సంబంధించిన బంధువులకు సమాచారం ఇవ్వాలని, అప్పటికీ రాకుంటే ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను నిలిపివేస్తామని చెప్పి తొందరగా రప్పించి భూ సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇకపై ఇలాంటి సాకులు చెప్పకుండా చెప్పిన తేదీ లోగా భూ సర్వేను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి తహశీల్దార్లు జామి ఈశ్వరమ్మ, బి.కిషోర్, జె.చలమయ్య, విఆర్ఒలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, బందోబస్తు ఏర్పాట్లపై కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, పోలీసు అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎం.కె మీనా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ లాఠకర్ వివరించారు. జిల్లాలోని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ప్రజాప్రతినిధులకు గుర్తింపు కార్డులు, పట్టభద్రుల ఓటర్లకు ఓటరు స్లిప్పులను అందిస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణకు నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన బందోబస్తు ప్రణాళికను రూపొందించామని చెప్పారు. పోలింగ్ నిర్వహణకు ప్రిసైడింగ్, అసిస్టెంట్ అధికారులుగా తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్లను నియమించామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. పోలింగ్ సిబ్బందికి ఈనెల 1, 7వ తేదీల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియకూ ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను వెబ్ కాస్టింగ్‌కు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఎఎస్‌పి టి.పి విఠల్ పాల్గొన్నారు.

భావితరాలకు సమరయోధుల స్ఫూర్తి తెలియాలి



శ్రీకాకుళం : స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తి భావితరాలకు తెలియాల్సిన అవసరముందని సిబిఐ మాజీ జెడి వి.వి లక్ష్మీనారాయణ అన్నారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న మహాత్మాగాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనాన్ని బుధవారం సందర్శించారు. తొలుత మహాత్మాగాంధీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేశారు. మందిరానికి వచ్చిన లక్ష్మీనారాయణను మందిర కమిటీ ప్రతినిధులు డాక్టర్ జామి భీమశంకర్, కొంక్యాన వేణుగోపాల్, మండవిల్లి, ఎస్.ఎస్ గుప్త, మహిబుల్లాఖాన్, గుత్తు చిన్నారావు, తర్లాడ అప్పల నాయుడు, పొన్నాడ రవికుమార్ తదితరులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 105 అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరించడం, ఎందరో సమరయోధులు, సంఘ సంస్కర్తల విగ్రహాలను మందిరంలో ఏర్పాటు చేసి సమరయోధుల జీవిత విశేషాలను నేటితరానికి తెలియజేయడం ప్రశంసనీయమన్నారు. నిత్యం పర్యవేక్షించే కేర్ టేకర్ రాజారావుకు నగదు పారితోషికాన్ని లక్ష్మీనారాయణ అందజేశారు.

భద్రత, సౌకర్యాల కల్పనే లక్ష్యం

ఎడిఆర్ఎం మనోజ్ కుమార్ సాహు

ప్రజాశక్తి - ఆమదాలవలస


రైల్వే ప్రయాణికులకు భద్రత, సౌకర్యాల కల్పనే లక్ష్యమని అసిస్టెంట్ డివిజనల్ రైల్వే మేనేజర్ మనోజ్ కుమార్ సాహు అన్నారు. శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లోని విఐపి లాంజ్‌లో స్టేషన్ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టిసారించాలని సిబ్బందికి సూచించారు. రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాలు, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలని స్పష్టం చేశారు. పరిశుభ్రతలో బాగానే ఉన్నా, ఇంకా మెరుగైన స్టేషన్‌గా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ప్లాట్‌ఫారాలపై డిస్‌ప్లే బోర్డులను పరిశీలించారు. పనిచేయని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేషన్ బయట పార్కింగ్ స్థలంలో వాహనాలు క్రమపద్ధతిలో ఉండేలా చూడాలని ఆర్‌పిఎఫ్ అధికారులను ఆదేశించారు. అద్దె ఎంత చెల్లిస్తున్నారు, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని దుకాణదారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అవినాష్, స్టేషన్ మాస్టర్ ఎం.రవి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, బుకింగ్ చీఫ్ సూపర్‌వైజర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎడిఆర్ఎం మనోజ్ కుమార్ సాహు

అన్నదాతతోనే దేశాభివృద్ధి

వ్యవసాయశాఖ జెడి శ్రీధర్



ప్రోత్సాహకాన్ని అందిస్తున్న జెడి, కోరమాండల్ ప్రతినిధులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

దేశానికి అన్నం పెట్టే రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ అన్నారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో కోరమాండల్ ఫెర్టిలైజర్స్ ఆధ్వర్యాన బాలికా విద్యను ప్రోత్సహిస్తూ చదువులో ప్రతిభ కనబరిచిన బాలికలకు నగదు ప్రోత్సాహకాలను నగరంలో అంబేద్కర్ ఆడిటోరియంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో అధునాతన పద్ధతులను అవలంభించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని చెప్పారు. సమాజ సేవకు కోరమాండల్ ఫెర్టిలైజర్స్ ముందుంటుందని తెలిపారు. కోరమాండల్ ఫెర్టిలైజర్స్ జోనల్ మేనేజర్ కీర్తి కృష్ణ మాట్లాడుతూ రైతుల కుటుంబాలు సామాజికంగా, ఆర్థికంగా బాగుంటేనే సమాజం బాగుంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు ఉద్దాన ప్రాంతంలో త్వరలోనే మూడు ఆర్ఒ ప్లాంట్లను ఏర్పాటు చేసి, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతు కుటుంబాల్లోని ఆడబిడ్డల చదువును ప్రోత్సహించడంలో భాగంగా వారికి నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నామని వివరించారు. అనంతరం తొమ్మిదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి పదోతరగతి చదువుతున్న విద్యార్థినులకు ప్రథమ బహుమతి రూ.ఐదు వేలు, ద్వితీయ బహుమతి రూ.3,500 చొప్పున జిల్లాలో 50 జిల్లాపరిషత్ పాఠశాలల నుంచి వంద మంది బాలికలకు రూ.4.25 లక్షల ప్రోత్సాహకాలను అందించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మేనేజర్ రోజారమణి, కిషోర్ వర్మ, చిలుకు కృష్ణారావు, కోరమాండల్ ఫెర్టిలైజర్స్ ప్రతినిధులు, సిబ్బంది, విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాక్షస పాలన పోవాలి


మాట్లాడుతున్న గౌతు శిరీష

పలాస : రాష్ట్రంలో రాక్షస పాలన పోవాలంటే టిడిపి అధికారంలోకి రావాలని, అందుకు ప్రతి ఒక్కరు టిడిపిని గెలిపించేందుకు కృషి చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పిలుపునిచ్చారు. మందస మండలం అంబుగాంలో ఇదేం ఖర్మం మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ పురవీధుల్లో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలన అధ్వానంగా ఉందన్నారు. అమ్మఒడి అని చెప్పి.. కుంటుసాకులతో అమ్మఒడిని ఇవ్వడం లేదని, ఇంటి కొలతలు వేసి, పింఛను ఆపేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న 2024 ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు టిడిపి కార్యకర్తలు నడుంబిగించాలన్నారు. కార్యక్రమంలో అంబుగాం పంచాయతీ ఎంపిటిసి హేమావతి, పురుషోత్తం, లచ్చయ్య, చౌదరి మురళి, ఆర్.శ్రీను, తారక్, జీవన్, దుర్యోధన, జి.కె నాయుడు, ఎల్.దుర్యయ్య, కర్రియ్య, దాసరి తాతారావు, నవీన్‌యాదవ్, వాసు, బి.కృష్ణ, వీరాస్వామి, బి.గున్నయ్య, డి.తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

'ఐతమ్' అధ్యాపకునికి డాక్టరేట్


ధర్మాన లోకనాధం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల రూరల్
ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ధర్మాన లోకనాధంకు ఆంధ్రా యూనివర్శిటీ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీని ప్రదానం చేసినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. జెఎన్‌టియుజె విజయనగరం విసి కె.వెంకట సుబ్బయ్య మార్గదర్శకత్వంలో 'ఫ్యాబ్రికేషన్ క్యారెక్టరైజేషన్ అండ్ ఆప్టిమైజేషన్ ఆఫ్ అల్యూమినియమ్ లిథియమ్ ప్యూర్ పర్టిక్యులేట్ కాంపోజిట్స్' అనే అంశంపై పరిశోధన చేశారని అన్నారు. ఈ పరిశోధనకు ఎయు లోకనాధంకు డాక్టరేట్ ప్రదానం చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకుడిని ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావుతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆర్ అండ్ డి డాక్టర్ కె.బి.మధుసాహు, డీన్ ఆర్ అండ్ డి డాక్టర్ డి.ఆశాఖ్, మెకానికల్ హెచ్‌ఒడి డి.శ్రీరాములు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

నేడు, రేపు జాతీయ సెమినార్

శ్రీకాకుళం: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురు, శుక్రవారం నూతన విద్యా విధానంపై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెమినార్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సుమారు 300 మంది ప్రతినిధులు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి అంబేద్కర్ యూనివర్శిటీ విసి నిమ్మ వెంకటరావు, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ హాజరవుతున్నారని తెలిపారు.

నేడు హుండీ లెక్కింపు

జలుమూరు: శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామి హుండీని గురువారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రభాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయశాఖ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ పెద్దలు సమక్షంలో ఉదయం 11గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి గల యాత్రికులు హుండీ లెక్కింపులో పాల్గొనవచ్చన్నారు.

యుటిఎఫ్ మండల అధ్యక్షునిగా జానకిరావు

కవిటి: యుటిఎఫ్ కవిటి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా జి.జానకిరావు, ఆర్.జగదీష్ ఎన్నికయ్యారు. బుధవారం మండలశాఖ సమావేశం నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ఎల్.బాబూరావు, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.వెంకటరావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులుమురళీప్రకాష్, సింహాచలం, కామేష్, లక్ష్మణ్, సూర్యం పాల్గొన్నారు.

జన జాతర


పలాస : భారీగా తరలివచ్చిన యాత్రికులు

ప్రజాశక్తి - పలాస
జామి ఎల్లమ్మ జాతర ఉత్సవాలు జిల్లాలోని పలాస, నౌపడ, కవిటి, ఇచ్ఛాపురంలో ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ జాతరకు భారీగా జనాలు తరలివచ్చారు.

పలాసలో జామి ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతర తర్లాకోట జమీందారు కాలం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు కొల్లకోట వంశీకులు తెలిపారు. ఏటా మహాశివరాత్రి తర్వాత వచ్చే మృగశిర నక్షత్ర అమృత గడియల్లో జాతరను ప్రారంభించిన మాదిరిగానే మంగళవారం రాత్రి ఆలయంలో సింధూరు పంటను పండించి అర్ధరాత్రి తర్వాత అమ్మవారి ప్రతిమలను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో ప్రతిష్టించి, పూజలు ప్రారంభించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వేకువ జాము నుంచే అధిక సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. పలాస కాశీబుగ్గ పరిసర ప్రాంతాలతో పాటు మందస, వజ్రపుకొత్తూరు, నందిగాం, మెలియాపుట్టి తదితర మండలాలతో పాటు పర్లాకిమిడి, ఒడిశా గ్రామాల నుంచి వందలాది మంది వచ్చి, మొక్కులు సమర్పించుకున్నారు.

దర్శించుకున్న ప్రముఖులు

ప్రజలందరూ సుఖ సంతోషాలతో చల్లగా ఉండాలని జామీ ఎల్లమ్మను కోరినట్లు అమ్మవారిని దర్శించుకున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. మంత్రి వెంట పి.వి.సతీష్, శ్రీనివాస్, బల్లయ్య, జి.మన్మథరావు, గోపి, తదితరులు ఉన్నారు.

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్, గుప్త, నాగరాజు, తదితరులు ఉన్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు

ఎల్లమ్మను దర్శించుకునేందుకు వచ్చిన వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, కాశీబుగ్గ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ రాజగోపాలరావు, చైర్మన్ బల్ల గిరిబాబు ఆధ్వర్యంలో శానిటేషన్ చేయించారు. యాత్రికులకు తాగునీరు, మజ్జిక అందజేశారు. ముగ్గురు సబ్ ఇన్‌స్పెక్టర్లు, 150 మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

లైయన్స్ క్లబ్ మహిళా విభాగం ఆధ్వర్యాన యాత్రికులకు రాగోలు జెమ్స్ ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని చైర్మన్ గిరిబాబు, కమిషనర్ రాజగోపాలరావు ప్రారంభించారు. పలాస జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యాన పది వేల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. పలాస ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన పులిహోర పంపిణీ చేశారు.


ఎల్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే అశోక్


నౌపడ : ఎల్లమ్మ జాతరకు తరలివచ్చిన యాత్రికులు

కవిటి: మండలంలోని కవిటి, బైరెడ్లపుట్టుగ, జాడుపుడి గ్రామాల్లో బుధవారం జామి ఎల్లమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పోటెత్తిన యాత్రికులు

నౌపడ: సంతబొమ్మాళి మండలం చిన్న మర్రిపాడులో కళింగ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ జాతరకు యాత్రికులు భారీ ఎత్తున తరలివచ్చారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ జాతరలో చివరి రోజు బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులు మొక్కులు తీర్చుకున్నారు. పలు సేవా సంఘాలు మజ్జిగ, తాగునీటిని అందించాయి. అధికారులు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎస్ఐ లావణ్య ఆధ్వర్యాన బందోబస్తు నిర్వహించారు. యాత్ర జరిగే మైదానంలో దుమ్ము, ధూళితో యాత్రికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, సర్పంచ్ కల్పనా రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఎల్లమ్మ జాతరలో ఎమ్మెల్యే అశోక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ సారి కూడా జామి జాతరకు భారీ ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. కమిటీ సభ్యులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ఢిల్లీరావు, ఆసి లీలారాణి, ఎన్.కోటేశ్వరరావు, ఎన్.జాని, కె.శంకరరెడ్డి, జె.శ్రీను, సహదేవరెడ్డి, కమిటీ సభ్యులు ఆసి చిరంజీవులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో తెగుళ్ల నివారణ


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ప్రజాశక్తి- రణస్థలం
మొక్కజొన్నలో వచ్చే పురుగులు, తెగుళ్లపై రైతులు యాజమాన్య పద్ధతులు అవలంబించాలని నేచురల్ ఫార్మింగ్ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ రైతులకు సూచించారు. మండల కేంద్రంలో బుధవారం మొక్కజొన్నలో పెస్ట్ సర్వేలెన్స్‌లో భాగంగా మొక్కజొన్న పంటను పరిశీలించారు. రైతులకు మొక్కజొన్నను ఆశించే పురుగులు, తెగుళ్ల గుర్తించి, యాజమాన్య పద్ధతులను రైతులకు తెలియజేశారు. ముఖ్యంగా మొక్కజొన్నలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఏ సమయంలో ఏ పద్ధతులను ఆచరించాలి అనేది రైతులకు అర్థమయ్యేలా వివరించారు. ఎకరానికి 400 కిలోల ఘనజీవామృతం, ప్రతి 15 నుండి 20 రోజులకు ఒకసారి 200 లీటర్ల ద్రవ జీవామృతంను వాడకం వల్ల తక్కువ ఖర్చుతో మొక్కజొన్నను సాగు చేయవచ్చని అన్నారు. పంట వేసిన 15 రోజులకు నీమస్త్రాన్ని పిచికారి చేయాలని, ప్రధాన పంట చుట్టూ రెండు వరుసలు జొన్నలు లేదా సజ్జలు వేసుకోవాలని, తీగజాతి కూరగాయలైన బీర, చిక్కుడు, ఆనప వేసుకుంటే అదనపు ఆదాయం సమకూరుతుందని చెప్పారు. కత్తెర పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలను ఎకరానికి 10 పెట్టుకోవాలని చెప్పారు. ఉధృతి ఎక్కువగా ఉంటే కషాయాలను పిచికారి చేయాలని అన్నారరు. కార్యక్రమంలో పెద్దింటి రాజేశ్వరి, కేలం లక్ష్మి, గడ్డపు రమణమ్మ, సువ్వాడ సత్యవతి, రైతులు పాల్గొన్నారు.

చెరుకు రైతులను ఆదుకోవడమే లక్ష్యం

- వైస్ ప్రెసిడెంట్ నాగశేషారెడ్డి
- మామిడివలసలో చెరుకు కొనుగోలు కేంద్రం ప్రారంభం


చెరుకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాగ శేషారెడ్డి

ప్రజాశక్తి - బూర్జ
చెరుకు రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడమే తమ లక్ష్యమని ఈఐడి ప్యారీ చక్కెర పరిశ్రమ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ నాగ శేషారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మామిడివలస గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన చెరుకు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చెరుకు రైతులు తాము పండించిన పంటలను సంజీవని చక్కెర ఫ్యాక్టరీకి తరలించేందుకు వ్యయప్రయాసలు పడుతున్నారని ఆయన తెలిపారు. రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని రైతులకు వ్యయ భారాన్ని తగ్గించేందుకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీని వల్ల రైతులు పండించిన చెరుకును తమ సమీపంలోని కేంద్రం వద్దనే విక్రయించుకోవచ్చని తెలిపారు. దీని వల్ల రైతులు అధిక లాభాలు పొందేందుకు వీలుంటుందన్నారు అంతేకాకుండా రైతులకు కూలీల కొరత తగ్గించేందుకు వీలుగా మినీ ట్రాక్టర్లు, పవర్ తిల్లర్‌లు, పవర్ వీడర్స్ తదితర యంత్రాలను వడ్డీ లేకుండా మూడేళ్ల క్రితం ఈ యంత్రాలను అందజేసినట్లు చెప్పారు. ఈ మండలం నుండి సుమారు పదివేల టన్నుల చెరుకు ఏటా ఉత్పత్తి అవుతోందని అన్నారు. తమ సంస్థ ద్వారా అందిస్తున్న ఈ సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఇంకా అన్ని ప్రాంతాల్లోనూ చెరుకు సాగుకు రైతులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ క్రేన్ రమేష్‌రెడ్డి, ఎజిఎం క్రేన్ అప్పారావు, మేనేజర్ కమల్ పట్నాయక్, గ్రామ సర్పంచ్ కోవగాన రామకృష్ణ ఎంపిటిసి చక్కర పోలినాయుడు, రైతులు గోవిందసాహు, మామిడి వెంకటప్పనాయుడు గొల్వే సీతారాం, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రెండు రోజుల్లో నీటిని అందిస్తాం


పైపులైను పనులను పర్యవేక్షిస్తున్న ధనుంజయ

ఎచ్చెర్ల : మండలంలోని ఆయా ధర్మవరం పంచాయతీ ఆయా ధర్మవరం, కొంగ్రాం, సుబేదార్‌పేట, గ్రామాలకు రెండు రోజుల్లో మంచినీటి సరఫరాను పునరుద్ధరిస్తామని సర్పంచ్ ప్రతినిధి బసవల ధనుంజయ తెలిపారు. ఫ్లైవర్ బ్రిడ్జి వద్ద విరిగిపోయిన పైపులైను పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ధనుంజయ మాట్లాడుతూ ఈ గ్రామాలకు ఎచ్చెర్ల మంచినీటి పథకం కేంద్రం నుంచే కుళాయిలతో నీరు సరఫరా జరుగుతోందని, పైపులైను విరిగి పోవడం వల్ల అంతరాయం ఏర్పడిందన్నారు. మరమ్మతు పనులు పూర్తి చేసి, నీటిని సరఫరా చేస్తామని అన్నారు.

బాలికలకు ప్రతిభా పురస్కారం

నౌపడ: సంతబొమ్మాళి మండలం డి.జి.పురం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు కొన్ని చాందిని, మామిడి పూజకు గ్రామీణ బాలికల ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. గ్రోమోర్, మురుగప్పన్న సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న పురస్కారాలను కోడి రామ్మూర్తి స్టేడియంలో విద్యార్థినులు అందుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం పి.జానకి రమయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

ఎచ్చెర్ల: విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని దంత వైద్యులు బాలప్రసాద్, అనీషా అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు దంత ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ మాట్లాడుతూ యుక్తవయస్సులో వచ్చే వ్యాధులపై మొదటినుంచే శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో చైతన్యం కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు అవసరమన్నారు. అనంతరం వైద్యులను కళాశాల సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బేపల సతీష్‌కుమార్, లూకపాల్, రమణమూర్తి, లక్ష్మణరావు, శివాజీ, హరి, తరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితుల బియ్యాన్ని బొక్కేశారు

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల మేజర్ పంచాయతీ గొడగల వీధిలోని 15 దళిత కుటుంబాలకు ఫిబ్రవరి నెల ఇవ్వాల్సిన రేషన్ బియ్యాన్ని వైసిపికి చెందిన నాయకులు బొక్కేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌సి ఎస్‌టి విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులు బెలమర ప్రభాకరరావు ఆరోపించారు. బుధవారం ఎచ్చెర్ల సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో సూపరింటెండెంట్ పద్మకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్న అన్ని వీధులకూ బియ్యాన్ని అందించి, దళితులకు ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. ఈ ప్రాంత దళితులపై వైసిపి నాయకులు వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ చేసి, సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకోవాలని బెలమర ప్రభాకరరావు డిమాండ్ చేశారు.

కూలి గిట్టుబాటు అయ్యేలా 'ఉపాధి'

లావేరు: కూలి గిట్టుబాటు అయ్యేలా ఉపాధి హామీ పనులు చేయాలని ఉపాధి హామీ ఎపిడి లోకేష్ అన్నారు. బుధవారం బెజ్జిపురంలో చేపట్టిన పనులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని, కనీస వేతనం రూ.257 వచ్చేలా చూడాలన్నారు. ఆయనతో పాటు గౌరినాయుడు, గౌతం, రవి, వెంకటరమణ, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

లావేరు: బుడుమూరు జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డుపై మంగళవారం అర్థరాత్రి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందారు. మృతుడు జేబులో విశాఖ నుంచి రాజాం వెళ్లే బస్సు టిక్కెట్ ఉందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతికి గల కారణాలు, మృతుని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

ఆస్పత్రికి వెళ్లి వృద్ధునికి పింఛను అందజేత


పింఛను అందజేస్తున్న సాయి

జి.సిగడాం: మండలంలోని మెట్టవలస గ్రామానికి చెందిన ఎల్.సింహాచలం కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ వాలంటీర్ ఎల్.సాయి ఆస్పత్రిలోనే ఉన్న వృద్ధుని వద్దకు వెళ్లి పింఛను అందజేశారు. గ్రామస్తులు వాలంటీర్‌ను అభినందించారు.

'తోటపల్లి' సాగునీరు ఇవ్వాలి


మాట్లాడుతున్న ఎంపిపి రజని

ప్రజాశక్తి - రణస్థలం
తోటపల్లి కాలువ ద్వారా గత ఏడాది నీరు రాలేదని, ఈ ఏడాదైనా కాలువలో పేరుకుపోయిన పూడికలు ఉపాధి హామీ పథకం ద్వారా తొలగించి, నీరు అందించాలని తోటపల్లి ప్రాజెక్టు ఎఇ రామలక్ష్మిని ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పిన్నింటి రజని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖ, మత్స్యశాఖ, అటవీశాఖ, సాంఘిక సంక్షేమశాఖ, పౌరసరఫరాలశాఖ, పరిశ్రమలశాఖ, ఎక్సైజ్‌శాఖ అధికారుల సమావేశానికి గైర్హాజరుపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఎంపిడిఒ ధనుంజయరావు స్పందిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల విధుల కారణంగా రాలేకపోయారని చెప్పారు. నిరుపేదలైన వికలాంగులకు పింఛను రావడం లేదని కృష్ణాపురం ఎంపిటిసి మహంతి చినరామనాయుడు అధికారుల దృష్టికి తెచ్చారు. కమ్మసిగడాం పంచాయతీలో నాలుగు పాఠశాలలు శిథిలావస్థకు చేరాయని, వీటిని బాగు చేయడంలో అధికారులు పక్షపాతం ప్రదర్శిస్తున్నారని సర్పంచ్ ప్రతినిధి అప్పారావు అన్నారు. ఎంఇఒ ఎ.త్రినాథరావు స్పందిస్తూ మూడో విడత నాడు-నేడులో పాఠశాలల అభివృద్ధి పనులు చేస్తామని అన్నారు. ఇటీవల కోష్ట కూడలిలో దొరికిన

అధికారులను నిలదీసిన సభ్యులు

పాపను ఓ ఉన్నత కుటుంబం దత్తత తీసుకొని ఆస్ట్రేలియాకు తీసుకెళ్లారని ఐసిడిఎస్ పిఒ ఝాన్సీరాయ్ తెలిపారు. కమ్మ సిగడాం కూడలి నుంచి తిరుపతిపాలెం మీదుగా జాతీయ రహదారి వరకు రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయాలని సర్పంచ్ ఆకులు రవికుమార్ కోరారు. గ్రామాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని రిమ్స్ ఆస్పత్రి బ్లడ్ బ్యాంకు కౌన్సిలరు తాతారావు సభ్యులను కోరారు. అత్యవసర సమయంలో రక్తంకావాల్సిన వారు తమను సంప్రదిస్తే రక్తం అందిస్తామన్నారు. సమావేశంలో పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టి.సీతారాం, బి.దుర్గారావు, ఎంపిడిఒ ధనుంజయరావు. ఆర్.భుజంగరావు, కామరాజు, బి.రమణ, ఎం.శ్రీనివాసరావు, రామానాయుడు, శ్రీను, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వివరిస్తే చాలు

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి - కోటబొమ్మాళి
ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తే చాలు అని, మళ్లీ జగన్ సిఎం అవ్వడం ఖాయమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని విశ్వనాధపురం సచివాలయం పరిధిలోని సర్పంచ్, ఎంపిటిసి, వార్డు మెంబర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో అధికారం కోసం టిడిపి ఎన్నో ఎత్తుగడులు వేసి, ప్రజలకు అసత్యాలు చెప్పి ప్రభుత్వంపై అపనమ్మకం కలిగేలా చేస్తుందని, దీన్ని ఇప్పటి నుంచే తిప్పికొట్టాలని అన్నారు. గ్రామంలో పర్యటించి ప్రజలకు ప్రభుత్వ పాలనపై వివరించాలని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బి.మురళి, సచివాలయ గడ్డవలస నాగభూషణరావు, దుక్క రోజారామకృష్ణ, నూక సత్యరాజు, దుంగ శిమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు ఉపకరణాలు


వీల్‌చైర్‌ను అందజేస్తున్న ఎంఇఒ రామరాజు


పొందూరు: స్థానిక భవిత కేంద్రంలో సమగ్రశిక్ష-సహిత విద్య విభాగం తరుపున వికలాంగ విద్యార్థులకు అవసరమైన పలు ఉపకరణాలను ఎంఇఒ పి.వి.రామరాజు బుధవారం పంపిణీ చేశారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థిని భార్గవికి వినికిడి యంత్రం, ఎనిమిదో తరగతి విద్యార్థిని ఫాతిమాకు వీల్‌ఛైర్‌ను అందజేశారు. ఆర్‌పి ఫౌండేషన్ ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన క్రీడా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థి ఎన్.నాగహర్షవర్ధన్‌కు ఒక జత స్పై ఫూస్, రెండు స్పోర్ట్స్ దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌పి ఫౌండేషన్ చైర్మెన్ భార్గవ్, ఐఇఆర్‌టి కె.దినేష్, వి.తేజ, ఎంఆర్‌సి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో బోరు ఏర్పాటు


బోరు పనులకు శంకుస్థాపన చేస్తున్న వెంకట భానోజీనాయుడు

రణస్థలం రూరల్ : రణస్థలం శ్మశాన వాటికలో నీటి సదుపాయం కోసం సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ పిన్నింటి వెంకటభానోజీనాయుడు చొరవతో బోరును తవ్వారు. కార్యక్రమంలో ఎంపిటిసి మజ్జి వెంకటరమణ, విశ్రాంత ఎంఇఒ పి.సూర్యనారాయణ, కెల్ల సత్యం, పోస్టుమాన్ కృష్ణ, గుడిపాటి రామ పంతులు, కె.వెంకటరమణ, పి.చిన్నారావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ మృతి


భానుప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి - మెళియాపుట్టి
రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కప్ప భాను ప్రకాశ్‌రెడ్డి బుధవారం రాత్రి మృతి చెందారు. ఈయన కొంత కాలంగా కిడ్నీ, ఊపిరితిత్తులు, మధుమేహం, బిపి, తదితర సమస్యలతో బాధపడుతున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో విశాఖ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం విషమించి బుధవారం మృతి చెందారు. మృతునికి భార్య లక్ష్మి, కుమార్తె బిందు, కుమారుడు అవినీష్‌రెడ్డి ఉన్నారు. ఈయన 1990వ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీలో చేరి క్రియాశీలక కార్యకర్తగా పని చేశారు. తర్వాత వైసిపిలో చేరారు. ప్రస్తుతం రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయన మృతితో పలువురు రాజకీయ నేతలు సంతాపం తెలిపారు.

రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



శ్రీకాకుళం: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

ప్రజాశక్తి - శ్రీకాకుళం
సర్ సి.వి.రామన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల డైరెక్టర్ బరాటం శ్రీనివాస చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎన్‌వి.వేణుగోపాల్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సర్ సి.వి.రామన్ భౌతిక శాస్త్రంలో భారతదేశం తరపున మొత్తమొదటి గోల్డ్ మెడల్ సాధించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. విద్యార్థులు శాస్త్ర పరిశోధనల వైపు దృష్టి సారించాలని, భారత ప్రభుత్వం ప్రస్తుతం శాస్త్ర పరిశోధనలకు మంచి ఊతమిస్తోందని, సైంటిఫిక్ రంగంలో ఎన్నో అవకాశాలు వేచి ఉన్నాయని తెలిపారు. కాకినాడ శ్రీ ఆదిత్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఢిల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు సరైన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సరైన కాలంలో సరైన నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థీ మంచి లక్ష్యంతో ముందుకు అడుగువేసి తమ కళాశాలలో అందించే క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా మంచి ఉద్యోగం సాధించి, అతున్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అనంతరం సైన్స్ దినోత్సవంలో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఢిల్లేశ్వరరావు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, వివిధ విభాగాధిపతులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు శాఖా గ్రంథాలయంలో

లావేరు: లావేరు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో జాతీయ విజ్ఞాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సివి రామన్ చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ సమాజం కోసం శాస్త్ర విజ్ఞానాన్ని ఎందరో మేధావులు ఆవిష్కరించారని అన్నారు. రామన్ ఎఫెక్ట్ 1928, ఫిబ్రవరి 28న కనుగొన్నారని, నాటి నుంచి సైన్స్ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు చేసిన కొన్ని ప్రయోగాలకు గ్రంథాలయం తరపున బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లిటిల్ స్కూల్ ప్రిన్సిపాల్ బాలరాజు, గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ బెల్లం మార్కెటింగ్‌కు ప్రణాళిక


బెల్లం తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఆమదాలవలస
రుణాలు సక్రమంగా చెల్లించిన చెరుకు రైతులను గుర్తించి, వారితో ఆర్గానిక్ పద్ధతిలో బెల్లం తయారు చేయించి, మార్కెటింగ్‌కు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎపిఎం పైడి కూర్మారావు తెలిపారు. బుధవారం మండలంలోని నిమ్మతొర్లాడ, కొరపాం, చేపనపేటలో బెల్లం తయారీ కేంద్రాలను జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ అధికారులు పరిశీలించారు. ఆసక్తి ఉన్న చెరకు మహిళా రైతులతో మాట్లాడి ఎరువులు, కలుపు, క్రిమిసంహారక మందులు వాడకుండా పురాతన పద్ధతిలో రైతులు ఆవుపేడ, గోమూత్రం, వర్మి కంపోస్ట్, జీవామృతం తయారు చేసుకొని తద్వారా పండించిన చెరుకుతో నాణ్యమైన బెల్లం తయారీలో మిరియాల పొడి, సొంటి, మునగ, తదితర పోషక విలువలను జోడించి మార్కెట్ చేయడానికి అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. బ్యాంకు విల్లింగ్ ఉన్న వారికి అదనపు మిషనరీ కొనుగోలు కోసం అవసరమైన రుణ సౌకర్యం కల్పిస్తూ, ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్ల స్థాపనకు శ్రీకారం చుడుతున్నట్లు డిపిఎం నాగలక్ష్మి, స్త్రీనిధి బ్యాంకు ఎజిఎం సత్యనారాయణ, ఈశ్వరరావు, శ్రీనివాస్ బృందం తెలిపింది. కార్యక్రమంలో మహిళా రైతులు నక్క సుజాత, లీలారాణి, సిరిపురం కళావతి, గులివెందల ప్రభావతి, గ్రామ సంఘం అధ్యక్షురాలు బోనెల రోజా, విఒఎ శారద, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఇచ్ఛాపురం: ప్రతి సంఘం సభ్యులు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు సూచించారు. బుధవారం స్వయంశక్తి సంఘాల సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెలాఖరులోగా ప్రతి సంఘం ఖాతాలోఉన్న పొదుపు నిధులను ఉపయోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామ సంఘాల్లో చేరిన ప్రతి స్వయంశక్తి సంఘం సభ్యులు సభ్యత్వ రుసుం, వాటా ధనం, పొదుపు చెల్లించేలా మాట్లాడాలన్నారు. పెట్టుబడి రుణానికి సంఘం తీర్మానం, బయోమెట్రిక్ తప్పనిసరి అని అన్నారు. సమావేశంలో సిసిలు ఎ.రామకృష్ణ, మోహనరావు, ఆపరేటర్ విష్ణుబాబు, విఒఎలు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు